# *మాఘ మహాకవి యొక్క 'శిశుపాల వధ' మహాకావ్యంలో అనేక కవితా చమత్కారములు - ఉత్తర భాగం*

**Dr. Kasinadhuni Maheswara Prasad**

సంస్కృత పంచ మహాకావ్యములలో శిశుపాల వధ ఒక మహా కావ్యం. ఇది మాఘ భట్టారక ప్రణీతం. పండితులు దీన్ని మాఘ కావ్య మని కూడా అంటారు. సంస్కృత సాహిత్య రత్నాకరం లో ఇదొక అనర్ఘ రత్నం వంటిది. శిశుపాల వధ ఇతివృత్తానికి ఆధారం శ్రీమద్వ్యాస ప్రణీత మహాభారతమే. ఈ కథ భాగవతంలో కూడా కనిపిస్తుంది. శిశుపాల వధ మహాకావ్యాన్ని రచించిన మాఘ భట్టు ఔత్తరాదిక మహాకవి. చరిత్రను ఆధారంగా చేసుకుని చెప్పాలంటే, ప్రస్తుత గుజరాత్ రాష్ట్రంలో యున్న శ్రీమాల నగరం జన్మస్థలమని, ఏడవ శతాబ్దం వాడని చెప్పటం సత్యదూరం కాదు. ఒక కావ్యం మహాకావ్య మనబడా లంటే కనీసం పదునెనిమిది సర్గలతో, ఛందో వైవిధ్యంతో, అనేకప్రకృతి వర్ణనలతో కూడి, పర్వత, ఋతువర్ణనలు, సుమసౌరభము, పుష్పాపచయ, జలక్రీడా, ప్రభాత, సూర్యోదయ, సాయంకాల, చంద్రోదయ, మద్యపాన, సురత, క్రీడాభిరామం, కేళి, వినోద, శయ్యాసన,వన విహార, ప్రయాణ, దౌత్య, మల్లయుద్ధ, చిత్రయుద్ధ వర్ణనలతో విస్తరించి యుండాలి.

ఇరవై సర్గలతో కూడిన శిశుపాలవధ మహాకావ్యంలో మాఘ భట్టు 1675 శ్లోకాలలో అపారమైన ఛందోవైవిధ్యంతో, అనేక కవితా చమత్కృతులతో ఈ పై వర్ణనలన్నీ రసవత్తరంగా చేశాడు. సత్యం శివం సుందరమ్మను ఆర్యోక్తికి ఈ వర్ణనలన్నీ సోదాహరణములు. మహాకావ్యానుగుణంగా సందర్భోపేతమైన ధర్మోచిత వర్ణనలతోనూ, సాంగోపాంగంగానూ సర్గాంతం లో భావికథాంగ సూచనలతోబాటు, ముఖ్యంగా అనేక కవితా చమత్కారాలు శిశుపాల వధ లో చోటు చేసుకున్నాయి. మాఘ మహాకావ్యంలో సేనానివేశ, నాగరిక, సాగరిక, యమునా నది, నదీ నద నదీశ, సముద్ర భగవదవతార వర్ణనలు అధికంగా కనిపిస్తాయి. మాఘుడు వైష్ణవుడని ప్రతీతి. ఈ శిశుపాల వధ కావ్యంలో శ్రీకృష్ణభగవానుడు కథానాయకుడు. ప్రతినాయకుడు శిశుపాలుడు. ఇది వీర రస ప్రాధాన్యం. ఇందులో శృంగారకరుణాదులు అంగ రసాలు. శిశుపాల వధ మహాకావ్యం అనేకార్థిక, సాంఘిక, రాజకీయ శాస్త్రాలకేకాక, ఆయుర్వేద, ధనుర్వేద, గజాశ్వ విద్యా సంగీత వాణిజ్య శాస్త్రాలకు కూడ పారిచాయికగా రూపొందింది. ఒక విజ్ఞాన ఖనిజము. పాణిని వ్యాకరణసూత్రాలకొక సోదాహరణ పట్టిక. '*నవసర్గగతే మాఘే నవశబ్దో నవిద్యతే !*' – అంటే, మాఘుకావ్యంలో తొమ్మిది సర్గలను చదివిన వ్యక్తికి ఇక సంస్కృతంలో అర్థం తెలియని పదమంటూ ఉండదట ! మాఘభట్టు తన ఈ మహా కావ్యంలో, తనకు పూర్వీకుడైన భారవిని అనూకరిస్తూ రసాన్ని, రామణీయకతతో బాటు గొప్ప వైదుష్యాన్ని తన కవితా శిల్పంలో చూపించాడు. మాఘ మహాకవి అత్యంత శీలవంతుడు, బలసంపన్నుడు, ఉదారుడు, శబ్ద శాస్త్రజ్ఞుడు, ప్రౌఢ కవి. ఓజోగుణ ప్రాధాన్యుడు.

**ఉపమా కాళిదాసస్య, భారవేరర్థగౌరవమ్ ।**

**దండినః పదలాలిత్యం మాఘే సంతి త్రయో గుణాః ॥**

అంటే, ఉపమాలంకారాలకు కాళిదాసు, అర్థగురుత్వమునకు భారవీ, గొప్ప పదలాలిత్య గుణానికి దండి లబ్ధప్రతిష్ఠులైతే, వీరిలో గల మూడు ప్రత్యేక గుణాలూ, ఒక్క మాఘమహాకవి రచనాశిల్పంలో చోటు చేసుకున్నాయి. ఒకానొక పండితుడొకసారి ఏమన్నాడంటే – '*మురారి పదచింతనాచేత్ తదా మాఘేరతిం కురు*'. మాఘే, అంటే మా + అఘే = పాపం చేయకుము సుమా ! శ్రీహరి పదచింతన చేయాలనుకుంటే మాఘ కావ్యంలో రతించుము. ఈ మహా కావ్యం సారస్వత సారం. చిత్తజాడ్యహరం. సంస్కృత కవితా పాండిత్యానికి నికషోపలం వంటిది.

ప్రస్తుత వ్యాసంలో, మాఘ మహా కవి యొక్క కవితా చమత్కృతులను కొన్నింటికి సోదాహరణంగా , శిశుపాల వధ మహాకావ్యంలో, 19 వ సర్గ నుంచి కొన్ని శ్లోకాలను పాఠకులతో పంచుకోవటానికి సాహసిస్తున్నాను. స్థలాభావ కారణంగా, పూర్వభాగంలో క్రిందటి సంచికయందు ద్వ్యర్థి, నిస్తాలవ్యములు, సర్వతో భద్ర వృత్తము, అర్థభ్రమకము, ఏకాక్షరీ వృత్తము, ఏకాక్షరీ పాద వృత్తం, ద్వ్యక్షరి, సముద్గయమకములుదహరించబడినవి. ఈ సంచికలో ఉత్తర భాగంగా ప్రతిలోమానులోమపాద శ్లోకము, ప్రతిలోమానులోమ శ్లోకద్వయము, అర్థత్రయవాచికము, షడరర చక్రబంధము ఇత్యాది కవితా చమత్కృతులకు నిమ్నోక్త శ్లోకములు ఉదహరించ బడినవి.

*ప్రతిలోమానులోమ పాదః* - (Note: Each quarter or each line is a palindrome here in this sloka).

**నానాజావవజానానా**

**సా జనౌఘఘనౌజసా।**

**పరానిహాహానిరాప**

**తాన్వియాతతయాన్వితా॥ (19§40)**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| నా | నా | జా | వ | వ | జా | నా | నా |
| సా | జ | నౌ | ఘ | ఘ | నౌ | జ | సా |
| ప | రా | ని | హా | హా | ని | రా | ప |
| తా | న్వి | యా | త | త | యా | న్వి | తా |

తా. శిశుపాలుని సేన నానావిధమైన, నానాప్రకారాలుగా సాగుచున్న ఈ విచిత్రయుద్ధంలో నిర్భయంగా ప్రతాప క్రోధదుష్టబలాన్వితులై ప్రతిపక్ష నాయకుడైన అరివీరపరాక్రమశాలి అయిన శ్రీకృష్ణుని సేనను ప్రతిఘటించింది.

*ఏకాక్షరః (అనుప్రాసాలంకారము)* - ఈ శ్లోకము అతి విశిష్టమైనది. పండితులకు సదా సుపరిచితమైన సుశ్లోకము. అర్థగర్భితము. ( మూడు 'ద' లు *)

**దాదదో దుద్దదుద్దాదీ దాదదో దూదదీదదోః।**

**దుద్దాదం దదదే దుద్దే దదాదదదదోఽదదః॥ (19§114)**

దాదదో దుద్ద దుద్దాదీ = సాధుజనులను పీడించు రాక్షసులను, తాపము కలిగించు వారిని శిక్షించువాడు (దుత్=పీడను కలిగించుట); దాదదో దూద దీదదోః = జగత్కంటకుల నశింపజేయు బాహువులు గల వాడైన ఆ శ్రీహరి; దదాదద దదోఽదదః = సమస్తమును దాతలకిచ్చి లుబ్ధులను ఖండించు వాడయిన ఆ శ్రీహరి; దుద్దాదం దదదే దుద్దే = అస్త్రమును శత్రువునందు బడవేశెను. (* మూడు 'ద' లు – దైవము, దయ, దానము లను సదా జ్ఞాపకము జేసే శ్లోక రాజము !)

తా. సాధుజనులను పీడించు రాక్షసులను, తాపము కలిగించు వారిని శిక్షించువాడై, మఱియు, జగత్కంటకుల నశింపజేయు బాహువు లు గల వాడై, సమస్తమును దాతలకిచ్చి లుబ్ధులను ఖండించు వాడయిన ఆ శ్రీహరి, అస్త్రమును శత్రువునందు బడవేశెను.

*ద్వ్యక్షరి*–

**లోకాఽఽలోకీ కలోఽకల్కః కలిలోఽలికులాఽలకః।**

**కాలోఽకలోఽకలిః కాలే కోలకకేలికిలః కిలః॥ (19§98)**

తా. త్రైలోక్యదర్శియును, మధురభాషియు, నిష్పాపి, భ్రమరసమూహసదృశుడునూ, శ్యామలకేశములతోగూడిన, అఖండమైన అసీమితుడు, కృష్ణవర్ణుడును స్వయముగా ఎవరితోనూ కలహము జేయని వాడును మహాప్రళయాదులలో వరాహలీలలతో క్రీడించువాడు శ్రీకృష్ణుడు.

*అర్థత్రయవాచి* -

**సదామదబలప్రాయః సముద్ధతరసో బభౌ।**

**ప్రతీతవిక్రమః శ్రీమాన్ హరిర్హరిరివాఽపరే ॥ (19§116)**

ఈ శ్లోకంలో, మాఘ మహా కవి మూడర్థములొచ్చేటట్లు శ్రీకృష్ణుని తోనూ, సూర్యుని తోనూ, ఇంద్రుని తోనూ సామ్యము చూపుచున్నందున దీన్ని అర్థ త్రయవాచి గా పండితులు గుర్తిస్తారు. శ్రీకృష్ణుని సామ్యము తో అర్థము - సదా మదాన్వితుడైన బలరామప్రాయునివలె పృథ్విని ఉద్ధరించునిమిత్తమై వరాహావతారం లోనూ, సుప్రసిద్ధ త్రివిక్రమ పదన్యాసంతో శ్రీ వామనావతారం లోనూ, లక్ష్మీ పతితో గూడిన శ్రీపతి అయిన శ్రీకృష్ణుడు, రెండవ హరి వలె, అనగా ఇంద్రుడు లేక సూర్యుని వలె అతి శోభాయ మానుడై శోభించు చున్నాడు. ఇంద్రుని సామ్యము తో అర్థము - ఇంద్రుడుగూడ, సత్పురుషులను పీడించుచున్న

‘బల’ అను అసురుని సంహరించగానూ, అమృత పానము జేయుటచే వృత్రాసురుని సంహరించి రాజ్యలక్ష్మిని జేబట్టెను. సూర్యుని సామ్యము తో అర్థము - సూర్యుడుదయించి సత్పురుషుల రోగములు, దోషముల న పహరించినవాడై, జలాన్ని శోషణము జేయుచూ శోభాయమానముగా ప్రభాసించు చున్నాడు.

## *షడరర చక్రబంధము, చిత్రమలంకారః (శార్దూల విక్రీడితమ్)–*

**సత్త్వం మానవిశిష్టమాజిరభసాదాలంబ్య భవ్యః పురో**
**లబ్ధాఘక్షయశుద్ధిరుద్ధరతర శ్రీవత్సభూమిర్ముదా।**
**ముక్త్వా కామమపాస్తభీః పరమృగవ్యాధః సనాదం హరేః**
**ఏకౌఘైః సమకాలమభ్రముదయీ రోపైస్తదా తస్తరే॥ (19§120)**

తదా అసౌ = అప్పుడు శ్రీహరి; సత్త్వం మానవిశిష్టం = విశిష్టమైన సత్త్వసంశుద్ధిని శౌర్యమును; ఆలంబ్య = ఆవహింప జేసుకుని; ఆజిరభసాత్ = దండింపవలెనన్న ఔత్సుక్యముతో; భవ్యః పురో = అందరికినీ శ్రేష్ఠుడైన సూర్యుడును అయినట్టి; లబ్ధాఘక్షయ శుద్ధి = పాపక్షయముచేత పరిశుద్ధమైనట్టి; ఉద్ధరతర = గొప్పదైన; శ్రీవత్స భూమిః = శ్రీవత్సమనే చిహ్నము నకు భూమిక అయినట్టి; నాదం హరేః ముక్త్వా = సింహ గర్జనమును గావించి; తదా అపాస్తభీః = అప్పుడు పోయిన భయమును గలవాడై; పరమృగవ్యాధః = శత్రుసమూహములను వధించువాడై; పురః = ముందున్నట్టి ఆకాశమును; ఏకౌఘైః రోపైః = ఏక ప్రవాహముతో గూడిన బాణసమూహములతో; సమకాలమ్ = ఒకేసారిగా (ఒకుమ్మడిగా); తస్తరే = కప్పి వేసెను; సః ముదా = ఆ భగవంతుడు ముదముతో; తథా ఉదయీ = ఆ విధముగా జయలక్ష్మీ సమేతుడాయెను.

తా. ‘అందరికినీ శ్రేష్ఠుడైన శ్రీహరి విశిష్టమానమైనట్టి శౌర్యమునావహింపజేసుకుని శత్రువుల దండించవలెనన్న ఔత్సుక్యము తో పాపక్షయము వలన పరిశుద్ధమైనట్టి పరమో త్కృష్టమైన శ్రీవత్స లాంఛిత సమున్నతోరస్కుడు - శ్రీవత్స మనియెడి చిహ్నమునకు భూమిక అయినట్టి ఆ భగవంతుడు సమరోత్సాహముతో సింహగర్జనమును గావించి నిర్భయ చిత్తుడై శత్రుసమూహములను వధించుటకు ముందు నున్న ఆకాశమును ఏకప్రవాహముగ బాణసమూహములతో గప్పివైచి శ్రీహరి జయలక్ష్మీ సమేతుడాయెను’.

శార్దూల విక్రీడిత వృత్తం వీర రసాన్ని సూచిస్తుంది. సాధారణంగా వీరుడు క్రోధోద్దీపితుడై అనేక వికారాలతో భయంకరంగా ఉంటాడు. కానీ శ్రీకృష్ణునకెట్టి వికారములు లేవు. నిర్వికారుడు. గుణాతీతుడు అయినప్పటికీ దివ్యగుణోపేతుడు. భవ్య రూప సంపన్నుడు. తనను దర్శించిన వారి పాపాలను పటాపంచలము చేసేటంత స్ఫూర్తివానుడు. శ్రీవత్సం మహాపురుష లక్షణంగా ఉన్న ఎత్తైన వక్షస్థలము గలవాడు. సదనంలో గాని కదనంలో గాని జనావళి డెందాలను ఆకళింపజేసే సకల కల్యాణమూర్తి. శ్రీకృష్ణుడు పరమృగవ్యాధుడు. అంటే పగవారు మృగాల వలె బాధించు చో వారిని బాధించే వ్యాధుడతడు. ‘శ్వఘ్నీవ యోజిగీవాన్ లక్షమాదాత్ ’ – వ్యాధుని వలె భగవానుడు లక్ష్యాన్ని భేదిస్తాడని వేదవచనం. అలా వారిని హింసించటం (‘సింహ’ శబ్దానికి వర్ణవిపర్యయం ‘హింస’ కాబట్టి) ఆ కుక్షింభరుని హింస కూడ విశ్వంభరాభ్యుదయం కోసమే. ‘*తాంగూహత తమ సాపవ్రతేన, యధామీ అన్యోఽన్యన్న జానన్* అని శ్రుతి చెప్పినట్లు – శస్త్రాలు ఆకాశానికి అడ్డుగా నిలిస్తే ఏర్పడిన చీకటి శత్రువుల నాచ్ఛాదించి వాళ్ళలో వాళ్ళే ఒకరినొకరు గుర్తుపట్ట లేకుండా చేస్తుంది. ఇదే ఘట్టం మహాభారత సంగ్రామంలో సూర్యాస్తమయానికి శ్రీకృష్ణుడు అడ్డుపడటం, తద్విలంబనము, సైంధవుని హతమార్చిన వైనంలో, ఈ శ్రుతి ప్రమాణమును కార్యరూపంలో చూస్తాము. కవికి కలము వీరుడికి ఖడ్గం వంటిది. కావ్యజగత్తులో బంధ కవితలల్లడం ఒకవిధంగా రణ రంగములో యుద్ధవ్యూహాలను పన్నడం వంటిదే. ముఖ్యంగా వ్యూహాలను చిత్రబంధాలతో సమన్వయించి శిశుపాలవధ మహాకావ్యములో అర్ధభ్రమకము, సర్వతో భద్రము లాంటివి ఎన్నో బంధ కవితలను, అనేక కవితా చమత్కారాలని చూపించాడు.

మాఘ మహాకవి ఈ శ్లోకంలో చిత్రమలంకారం తో బాటు షడరర చక్రబంధము అనే కవితా చమత్కృతి జేశాడు. కాళిదాసాది మహా కవుల కాలంలో గ్రంథచౌర్యము (plagiarism), విరివిగా వ్యాపించి యుండెడిది. గ్రంథ చౌర్యాన్ని ప్రతిఘటించటమే ఈ చక్రబంధము నకు గల ఒక ముఖ్య వినియోగము, అని చెప్ప వచ్చును. అంతే కాకుండా, ప్రస్తుత కాలంలో అతి ప్రాచుర్యం పొందిన Encryption, Cryptography లాంటివే కాక, గ్రంథకర్త, కావ్యనామములు లాంటి ముఖ్య విషయాలను ప్రఛన్నంగా గుప్తపఱచటం లో embedded coding లాంటి modern coding techniques మాఘ మహాకవి ఏడవ శతాబ్దంలోనే వాడియుండటం ఈ నిమ్నోక్త చక్రబంధములో మనకి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. శిశుపాల వధ యందు మాఘ మహాకవి బంధించిన చక్రబంధము ఈ క్రింది విధంగా చూపబడింది. ఒకదానిలో నొకటి చొప్పున పది ఏక కేంద్ర గత వృత్తములను గీచి, ఆరు రేకులను సమాన రేఖలనుగా గీయాలి. ఒక్కొక్క రేకులో నాభిస్థానంతో బాటు 19 గదు లేర్ప డు తాయి. రేకుకొక్కపాదం చొప్పున ప్రదక్షిణ రీతిగా ఉండు పాదాలు వ్రాసి, నాల్గవ పాదాన్ని చక్రనేమిగా ఉన్న వెలుపలి వృత్తంలో వ్రాయాలి. మూడవ, ఆరవ వలయంలో కవి నామమూ(శిశుపాలవధః) , కావ్య నామమూ (మాఘకావ్యమిదం) పాఠకులు గుర్తింపనగును.

सत्वं मानविशष्ट माजिरभसादा लम्ब्य भव्यः पुरो
लब्धा घक्षय शुद्धिरुद्धरतर श्रवित्स भूमिर्मुदा ।
मुक्त्वा काम मपास्तभीः स नादं हरे-
रेकोघैः समकालमभ्रमुदयी रोपैस्तदा तस्तरे ॥



మాఘమహాకవి ప్రబంధంలోని షడరర చక్రబంధము

*ఇతి శమ్*